# ఆశ

**ఇంటి పరిస్థితిని గురించి ఆలోచిస్తూ నడుస్తోంది శ్రీవిద్య. సంపాదించే నాన్న ఉన్నట్టుండి, ఆక్సిడెంట్ వల్ల మంచాన పడటంతో తమ పరిస్థితి చాలా దయనీయంగా తయారైంది. విపరీతమైన ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇంటిల్లిపాది ఆత్మహత్యకు పాల్పడే సమయంలో నాన్నకు తెలిసిన స్నేహితుడు రాఘవరావు తమ పరిస్థితికి బాధపడి వారి ఆఫీసుకి వస్తే, తనకేదైనా ఉద్యోగం ఇస్తాననటంతో చదువు మానేసిన తను ఆయన విజిటింగ్ కార్డ్ పట్టుకుని ఇలా బయల్దేరింది.**

కేవలం చదువు కోసం తప్ప, మరే ఇతర విషయం గురించి బయట కాలు పెట్టలేదు తను ఇంతవరకు. అలాంటిది ఏకంగా ఉద్యోగం కోసమని, అపరిచిత వ్యక్తుల మధ్యకు వెళుతోంది. తనన నలు తీసుకుంటారా ఉద్యోగంలోకి? లేకపోతే సమస్య మళ్లీ మొదటికొస్తుంది. ఇలా రకరకాల ఆలోచనల్లో ఉన్న విద్య, హఠాత్తుగా రోడ్డుపైకి పరుగెత్తుకొస్తున్న చిన్నపిల్లవాడ్ని లారీ కింద పడకుండా ఆపింది. వయసు బహుశా ఐదు, ఆరు సంవత్సరాలుంటుందేమో. తైలసంస్కారం లేని రాగిజుట్టు, మట్టి కొట్టుకుపోయిన శరీరం, జిడ్డోడుతున్న డ్రాయర్ తప్ప మరే ఆచ్ఛాదన లేదు శరీరంపై. లారీ వెళ్లగానే ఒక్కసారి విద్యను చూసి విదిలించుకుని పరిగెత్తుకుంటూ రోడ్డు పక్కనున్న గుడిసెలో దూరాడా పిల్లవాడు. చుట్టూ చూసింది శ్రీవిద్య. రోడ్డుకి ఒక పక్కంతా బయటి కమ్మరివారి గుడిసెలున్నాయి. అవి గుడిసెల్లా కూడా ఉండవు. చిన్న గుడారాల్లా కేవలం టాప్ మాత్రమే కవర్ చేస్తూ ఉంటాయి. ప్రతి గుడారంలో రెండు, మూడు సత్తుగిన్నెలు, పళ్లెం, బిందె, చినిగిన బొంతలు, మాసిన దుప్పట్లు అస్తవ్యస్తంగా కనబడుతున్నాయి. గొడ్డళ్లు, శానాలు నిప్పుల్లో ఎర్రగా కాల్చి పెద్ద పెద్ద సుత్తెలతో కొడుతూ కనపడతారు వాళ్లు ఎప్పటికీ.

అసలు రాత్రి వచ్చినంత పెద్ద వర్షంలో ఈ తాటాకు కప్పుల కింద ఎలా ఉన్నారో ఇంత చిన్న చిన్న పిల్లలతో. అయినా ఇంత కష్టంగా ఎందుకు బ్రతకాలి? ఒంటి నిండా బట్ట, కడుపు నిండా తిండి కూడా లేక వీళ్లు జీవితంలో ఏం సాధిద్దామని బ్రతుకుతారో ఎంత ఆలోచించినా తనకర్థం కాదు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి అటు పరువు పోకుండా గుట్టుగా పదుగురిలో గౌరవంగా ఉన్న తనకే ఒక్కోసారి జీవితంపై విరక్తి పుడుతుంది. మరి వీళ్లెందుకు పుట్టరో. ఆలోచనల్లోనే గమ్యస్థానం రావడంతో ప్యూన్‌కి విజిటింగ్ కార్డ్ చూపించి లోనికెళ్లింది.


లోపల నాన్న ఫ్రెండ్, ఆ రోజు తన ఇంటికి వచ్చిన ఆపద్బాంధవుడు. అతనికెదురుగా మరో యువకుడు కూర్చుని ఉన్నారు. వెళ్లి నమస్కరించి విషయం చెప్పిన ఆమెను, కుశల ప్రశ్నలు వేశాక- "మీ నాన్న నీ గురించి చెప్పాడు. ఈ వయసులో కుటుంబ భారాన్ని మోయాల్సి రావడం నిజంగా కష్టమే. అయినా ఏం చేస్తాం. అంతా దైవేచ్ఛ. నీకు టైపింగ్ వచ్చు కాబట్టి, ఇవాళ నిన్ను టైపిస్టుగా చేర్చుకుంటున్నాను. ఈ కర్టెన్ పక్క తలుపుంది. అది తెరుచుకుని లోనికెళితే మేనేజర్ రామనాథంగారు ఉంటారు. ఆయనకు ముందే చెప్పాను. వెళ్లి కలువు. నేను మళ్లీ ఇంటర్‌కమ్‌లో మాట్లాడతాను" అన్నాడు.

తలుపు లోనికెళ్లింది శ్రీవిద్య. కానీ తన బాగ్ లోపలే మర్చిపోవడంతో మళ్లీ వెనక్కొచ్చి కర్టెన్ జరపడానికి కదులుతుండగా తన గురించి మాటలు వినబడటంతో అలాగే నిల్చుండిపోయింది సభ్యత కాదని తెలిసినా.

"ఏమిటి నాన్నా...ఎవరీ అమ్మాయి? ఇంత దుర్భర పరిస్థితుల్లో ఏమాత్రం ఎంజాయ్‌మెంట్ లేని జీవితం...వీళ్లు ఏం సాధిద్దామని బ్రతుకుతారో అర్థం కాదు" యువకుడి గొంతు.

"మాధవ్! ఆ రోజు నేను, ఫంక్షన్‌కి రమ్మని మీరెంత బలవంతం చేసినా రాకుండా వెళ్లింది వీళ్లింటికే. ఆ రోజు నేను రాకపోతే అమ్మెంత బాధపడిందో తెలుసా! అన్నావు గుర్తుందా! నేను అక్కడకు రాకపోవడం వల్ల పెద్ద నష్టమేమీ జరగదు. కానీ ఆ రోజు అక్కడకు వెళ్లడం వల్ల ఒక కుటుంబాన్ని ఆత్మహత్య చేసుకోకుండా కాపాడాను. ఆ సమయంలో నేను వాడి దగ్గరకు వెళ్లినందుకు ఎంత సంతోషపడ్డాడనీ. ఫంక్షన్‌కి నేను అటెండ్ అయినా ఇంత ఆనందం పొందలేకపోయేవాడిని.

యునో...హోప్ ఈజ్ ద ఎంజాయ్‌మెంట్ ఆఫ్ ఫ్యూచర్ ఇన్ అడ్వాన్స్- జీవితమన్నాక కష్టమో, నిష్ఠూరమో ఉండకుండా ఉండదు. అలాగ ప్రతీ మనిషికీ



జీవితంపై ఆశ కూడా అంతే సమానంగా ఉంటుంది. అది లేనినాడు భూమిపై ఎవరూ మిగలరు.

నేను మాత్రం... పుట్టడంతోనే నోట్లో బంగారు స్పూన్ పెట్టుకు పుట్టలేదే! ఈ రోజు నీకు నేనందిస్తున్న సదుపాయాలలో, ఖర్చుపెట్టిన డబ్బులో ఆవగింజంతైనా ఆనాడు నాకు ఎవరూ పెట్టలేదు. తల్లీ, తండ్రీ ఎవరో తెలియని అనాథగా, ఏ ప్రేమకూ నోచుకోక ఛీత్కారాలనే సత్కారాలుగా ఈసడింపులనే దీవెనలుగా తీసుకుని పెరిగిన వాణ్ణి. ఆ రోజు నేనూ, నాకీ బ్రతుకెందుకు, ఏం సాధిద్దామని అనుకుంటే ఈ స్థాయికి ఎదిగేవాడినా? నాకింద ఇంతమందికి ఉపాధి కల్పించేవాడినా? కానీ అలా ఎందుకనుకోలేదు? కారణం ఆశ. ఎందుకు బ్రతుకుతారో అర్థం కాదు అంటున్నావు కదూ! ఈ ఆశే గిట్టక తప్పదని తెలిసీ ప్రతీ జీవి మనుగడ సాగించడానికి ఆశాకిరణమవుతుంది. అదే సృష్టి విచిత్రం. అందుకే అలా చులకనగా ఎందుకు బ్రతుకుతారో అనవద్దు. తప్పు కదూ!" అంటున్నారాయన.

"సారీ నాన్నా!" ఆ తర్వాతేం వినబడటం లేదు శ్రీవిద్యకు.

ఇంతకు ముందు తను కూడా అదే విధంగా ఆలోచించింది అన్న విషయం వెంటనే స్ఫురణకు రాగానే తన ఆలోచనాసరళికి సిగ్గుపడి, తెలియజెప్పిన ఆయనకు మనసులోనే అభివందనం చేసింది శ్రీవిద్య.

దూరంగా ఎక్కడి నుండో 'చిన్ని చిన్ని ఆశ...' పాట వినిపిస్తోంది.

**-నామని సుజనాదేవి (కాజీపేట)**